పార్లమెంటుకు జమిలి బిల్లు నేడే

లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న కేంద్ర మంత్రి మేఘ్వాల్ • సంప్రదింపుల కోసం ఉభయసభల ఉమ్మడి కమిటీకి!

న్యూఢిల్లీ, డిసెంబర్ 16: జమిలి ఎన్నికల దిశగా కేంద్రం వడివడిగా అడుగులు వేస్తున్నది. ఈ మేరకు మంగళవారం లోక్‌సభలో రాజ్యాంగ(129వ) సవరణ బిల్లు-2024ను ప్రవేశపెట్టనుంది. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. విస్తృత సంప్రదింపులు జరిపేందుకు గానూ పార్లమెంటు ఉభయసభల ఉమ్మడి కమిటీకి ఈ బిల్లును సిఫారసు చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మేఘ్వాల్ కోరనున్నారు. ఎంపీల సంఖ్య ఆధారంగా ఆయా పార్టీలకు ఈ కమిటీలో చోటు కల్పించనున్నారు. ఏ పార్టీ తరపున ఎంతమంది సభ్యులు ఉంటారో స్పీకర్ సాయంత్రానికి ప్రకటించనున్నారు. అతిపెద్ద పార్టీగా ఉన్న బీజేపీ నుంచి కమిటీ చైర్మన్ ఉండనున్నారు. కమిటీలో ఉండేందుకు ఎంపీల పేర్లను ఇవాళే ప్రతిపాదించాలని రాజకీయ పార్టీలను స్పీకర్ కోరనున్నారు. ప్రాథమికంగా ఈ కమిటీ కాలపరిమితి 90 రోజులు విధించనున్నారు. తర్వాత ఈ గడువును పొడిగించే అవకాశం ఉంది. కాగా, జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు 32 రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వగా, 15 పార్టీలు వ్యతిరేకించినట్టు ఇప్పటికే రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ప్రకటించింది.

అసెంబ్లీ ఎన్నికలు వాయిదా వేసే వీలు

లోక్‌సభ ఎన్నికలతో పాటు ఏదైనా అసెంబ్లీకి ఎన్నిక నిర్వహించలేని పరిస్థితుల్లో తర్వాత నిర్వహించే అవకాశం ఉండనుంది. ఈ మేరకు కేంద్రం ప్రవేశపెట్టనున్న జమిలి ఎన్నికల బిల్లులో కీలక ప్రొవిజన్ ఉంది. 'లోక్‌సభ ఎన్నికలతో పాటు ఏదైనా అసెంబ్లీకి ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించలేమని ఎన్నికల సంఘం భావించినప్పుడు, ఆ అసెంబ్లీకి తర్వాత ఎన్నికలు జరిపేలా ఉత్తర్వులు జారీ చేసేందుకు రాష్ట్రపతికి సిఫారసు చేయవచ్చు' అని రాజ్యాంగ(129వ) సవరణ బిల్లులోని సెక్షన్ 2లోని సబ్ క్లాజ్ 5లో పొందుపరిచారు. కాగా, లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు జరిపేందుకు వీలుగా కేంద్ర మంత్రి వర్గం రెండు బిల్లులను తాజాగా ఆమోదించిన సంగతి తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికలను ఎప్పుడు జరపాలనే అంశాన్ని కేంద్రం తాత్కాలికంగా పక్కన పెట్టింది.



జమిలి ఎప్పుడు?

రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): మంగళవారం లోక్‌సభ ముందుకు జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులు చర్చకు రానున్నాయి. ఈ క్రమంలో అసలు జమిలి ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న చర్చ పెద్దయెత్తున జరుగుతున్నది. జమిలి ఎన్నికలకు అపాయింటెడ్ తేదీగా లోక్‌సభ తొలిసారి సమావేశమైన రోజును గుర్తించాలని కోవింద్ కమిటీ సిఫారసు చేసింది. ఈ లెక్కన ఈ లోక్‌సభ తొలి సమావేశం గత జూన్ 24న జరిగింది. అంటే లోక్‌సభ కాలపరిమితి తీరిపోయే నాటికి అంటే జూన్ 24, 2029లోపు జమిలి ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. చాల్సి ఉంటుంది. దీన్ని విశ్లేషిస్తే, 2029లోనే జమిలి ఎన్నికలు ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎన్డీయే కూటమిలో మిత్రపక్షంగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు కూడా జమిలి ఎన్నికలు 2029లోనే అంటూ పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. అలాగే, తన పూర్తి పదవీకాలాన్ని వదులుకోవడానికి ప్రధాని మోదీ సిద్ధంగా లేరని, ఈ క్రమంలో 2029లోనే జమిలి ఎన్నికలు ఉండొచ్చని మరికొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, 2027లో, 2028లో కూడా జమిలి ఎన్నికల నిర్వహణను కొట్టిపారేయలేమని, బిల్లు చట్టంగా మారాక, ఇది అంత కష్టతరమైన పనేమీకాదని మరికొందరు వాదిస్తున్నారు. ఇదిలాఉండగా.. సాధారణ ఎన్నికలు జరిగిన తర్వాత సమావేశమయ్యే తొలి లోక్‌సభ సమావేశంలో జమిలి బిల్లును రాష్ట్రపతి నోటిఫై చేయాలని, ఆ రోజును అపాయింటెడ్ డేగా తీసుకొంటే.. ఆ తర్వాత ఐదేండ్లకు జమిలి ఎన్నికలు నిర్వహిస్తారన్న వాదనను కూడా కొందరు తెరమీదకు తీసుకొస్తున్నారు. ఇదేజరిగితే, జమిలి ఎన్నికలు 2034లోనే జరుగొచ్చని ఇంకొందరు అభిప్రాయపడుతున్నారు.

70 గంటలు పనిచేస్తేనే పేదరికం కనుమరుగు

ఇన్ఫోసిస్ నారాయణమూర్తి

న్యూఢిల్లీ: దేశం పురోగతి సాధించాలంటే యువత 70 గంటలు పని చేయాల్సిందేనని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి పేర్కొన్నారు. కోల్‌కతాలో జరిగిన ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 70 గంటల పని విధానంపై గతంలో తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. ఇన్ఫోసిస్‌ను ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ కంపెనీలతో పోల్చినప్పుడు భారతీయులు చేయాల్సింది చాలానే ఉందని అనిపిస్తుందని చెప్పారు. దేశంలో ఇంకా 80 కోట్ల మంది ఉచిత రేషన్ అందుకుంటున్నారని, దీనిని బట్టి వారంతా పేదరికంలో ఉన్నట్టేనని పేర్కొన్నారు. కాబట్టి మన ఆకాంక్షలను ఉన్నతంగా ఉంచుకోవాలని సూచించారు. మనం కాకపోతే ఇంకెవరు కష్టపడతారని ప్రశ్నించారు.

నెహ్రూ లేఖలపై వివాదం

- తిరిగివ్వాలని రాహుల్‌ను కోరిన పీఎంఎంఎల్
- లేఖలను ఎందుకు దాస్తున్నారని బీజేపీ ప్రశ్నలు
- ఎడ్వినా సహా ప్రముఖులకు నెహ్రూ ఉత్తరాలు
- 51 బాక్సుల్లో సోనియా గాంధీకి చేరిన పత్రాలు?

న్యూఢిల్లీ, డిసెంబర్ 16: దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు చెందిన 80 ఏండ్ల నాటి పత్రాలు, లేఖలపై వివాదం రాజుకుంది. ఈ పత్రాలను తిరిగి అప్పగించాలని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఆమె కుమారుడు రాహుల్ గాంధీని ప్రధానమంత్రుల మ్యూజియం, గ్రంథాలయం(పీఎంఎంఎల్) కోరింది. ఈ మేరకు సెప్టెంబర్‌లో సోనియా గాంధీకి, ఈ నెల 10న రాహుల్ గాంధీకి పీఎంఎంఎల్ సభ్యుడు రిజ్వాన్ కద్రి లేఖలు రాశారు. నెహ్రూకు చెందిన లేఖలను పీఎంఎంఎల్‌కు తిరిగి అప్పగించాలని లేదా జిరాక్స్‌లు కానీ, స్కాన్డ్ కాపీలు కానీ ఇవ్వాలని రాహుల్ గాంధీని పీఎంఎంఎల్ సభ్యులు రిజ్వాన్ కద్రి కోరారు. ఇవి పీఎంఎంఎల్‌లో ఉంటే పరిశోధకులకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కాగా, రిజ్వాన్ లేఖపై సోనియా, రాహుల్ నుంచి స్పందన రాలేదని తెలుస్తున్నది.

సోనియా గాంధీ వద్ద నెహ్రూ లేఖలు?

20వ శతాబ్దపు దేశ, విదేశీ ప్రముఖులకు నెహ్రూ రాసిన ఉత్తరాలను పీఎంఎంఎల్ నుంచి తీసుకెళ్లారని కద్రి పేర్కొన్నారు. భారతదేశ చివరి బ్రిటన్ వైశ్రాయ్ మౌంట్‌బాటన్ భార్య ఎడ్వినా మౌంట్‌బాటన్, శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో పాటు జయప్రకాశ్ నారాయణ్, పద్మజ నాయుడు, విజయలక్ష్మీ పండిత్, అరుణ అసఫ్ అలీ, బాబు జగ్జీవన్‌రామ్, గోవింద్ వల్లభ్ పంత్ వంటి ప్రముఖులకు నెహ్రూ రాసిన ఉత్తరాలు ఇందులో ఉన్నట్టు కద్రి తెలిపారు. 51 డబ్బాల్లో ఉన్న ఈ లేఖలను నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ(ఎన్ఎంఎంఎల్)కి 1971లో జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఫండ్ అప్పగించింది. 2008లో సోనియా గాంధీ విజ్ఞప్తి మేరకు వీటిని ఎన్ఎంఎంఎల్ ఆమెకు అప్పగించినట్టు తెలుస్తున్నది. ఎన్ఎంఎంఎల్‌ను అందరి మాజీ ప్రధానుల మ్యూజియంగా విస్తరించి ఇటీవల కేంద్రం పీఎంఎంఎల్‌గా పేరు మార్చిన సంగతి తెలిసిందే.

నెహ్రూ లేఖపై మోదీ తప్పుదోవ పట్టించారు: ఖర్గే

రిజర్వేషన్లపై రాష్ట్రాలకు నెహ్రూ రాసిన లేఖపై ప్రధాని మోదీ వాస్తవాలను వక్రీకరించారని, దేశాన్ని తప్పుదోవ పట్టించారని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మోదీ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగంపై చర్చ సందర్భంగా.. 1947-52 మధ్య ఎన్నికైన ప్రభుత్వం లేకపోయినా కాంగ్రెస్ అక్రమంగా రాజ్యాంగాన్ని సవరించిందని, ఇందుకోసం రాష్ట్రాలకు నెహ్రూ లేఖలు రాశారని మోదీ ఆరోపించారు. అయితే, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల కోసమే రాజ్యాంగ సభ సభ్యులు రాజ్యాంగ సవరణ చేశారని, ఇందుకోసమే సీఎంలకు నెహ్రూ లేఖ రాశారని ఖర్గే చెప్పారు.

నెహ్రూ లేఖలను ఎందుకు దాస్తున్నారు?: బీజేపీ

నెహ్రూ లేఖలను దాచేందుకు గాంధీ కుటుంబం ఎందుకు ప్రయత్నిస్తున్నదో దేశానికి తెలియాలని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర పేర్కొన్నారు. ఇవేమీ వ్యక్తిగత ఆస్తులు కాదని, దేశానికి చెందిన చారిత్రక పత్రాలని ఆయన అన్నారు. ఈ ఉత్తరాలు ప్రజల్లో ఉండొద్దని గాంధీ కుటుంబం ప్రయత్నిస్తుండటానికి కారణమేంటని? వాటిల్లో ఏముంది? అని ఆయన ప్రశ్నించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆత్మకథ నుంచి కొంత భాగాన్ని సైతం పాత్ర షేర్ చేశారు. 'నెహ్రూను లార్డ్ మౌంట్‌బాటన్ బాగా ఆకట్టుకున్నాడు. బహుశా లేడీ మౌంట్‌బాటన్ ప్రభావం అంతకంటే ఎక్కువే ఉండొచ్చు' అని అందులో రాసి ఉంది. తద్వారా నెహ్రూ, ఎడ్వినా మౌంట్‌బాటన్ మధ్య సంబంధాన్ని పాత్ర పరోక్షంగా ప్రశ్నించారు.

భారతీయ అధికారులకు లంచాలు

- రైల్వే, హెచ్ఏఎల్, ఐఓసీ అధికారులకు భారీగా లంచాలు ఇచ్చినట్టు ఆరోపణలు
- అమెరికన్ కంపెనీలకు ఎస్ఈసీ జరిమానాలు
- చెల్లించి విచారణను తప్పించుకున్న సంస్థలు

న్యూయార్క్, డిసెంబర్ 16: భారతీయ అధికారులకు లంచాలు ఇచ్చి, అక్రమంగా కాంట్రాక్టులు పొందాయనే ఆరోపణలతో పలు అమెరికన్ కంపెనీలకు యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్(ఎస్ఈసీ) భారీగా జరిమానాలు విధించింది. మూంగ్ ఐఎన్‌సీ, ఒరాకిల్ కార్పొరేషన్, అల్బేమర్లే కార్పొరేషన్ వంటి సంస్థలు భారత్‌లో కాంట్రాక్టులు పొందేందుకు రైల్వే, హెచ్ఏఎల్, ఐఓసీ అధికారులకు లంచాలు ఇచ్చాయని ఎస్ఈసీ పేర్కొన్నది. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన ఎస్ఈసీ.. లంచాలు ఇచ్చిన మొత్తంపై 300 శాతం వరకు పెనాల్టీలు చెల్లించాలని ఆదేశించింది. విచారణ నుంచి బయటపడేందుకు ఆయా అమెరికన్ కంపెనీలు ఈ జరిమానాలను ఎస్ఈసీకి చెల్లించి సెటిల్ చేసుకున్నాయి. భారత్‌లో ప్రభుత్వ అధికారులకు అదానీ సంస్థలు లంచాలు ఇచ్చాయని అమెరికాలో అభియోగాలు నమోదైన నేపథ్యంలో ఎస్ఈసీ చర్యలు కీలకంగా మారాయి.

దక్షిణ మధ్య రైల్వే అధికారులకు లంచాలు?

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్), భారతీయ రైల్వే అధికారులకు 4.24 కోట్ల లంచాలు ఇచ్చిందని మూంగ్ ఐఎన్‌సీ అనే సంస్థపై ఆరోపణలు వచ్చాయి. ఈ సంస్థ భారత్‌లో మూంగ్ మోషన్ కంట్రోల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని నిర్వహిస్తున్నది. దక్షిణ మధ్య రైల్వే నుంచి ఓ కాంట్రాక్టును పొందేందుకు ఈ కంపెనీ 2020లో రైల్వే అధికారులతో పాటు రిసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ అధికారులకు లంచాలు చెల్లించిందని అక్టోబరు 11న జారీ చేసిన ఉత్తర్వుల్లో ఎస్ఈసీ పేర్కొన్నది. హెచ్ఏఎల్ నుంచి రూ.11 కోట్ల కాంట్రాక్టును పొందడానికి ఓ అధికారికి 2.5 శాతం లంచం ఇచ్చినట్టు తెలిపింది. ఈ ఆరోపణల నేపథ్యంలో రూ.14 కోట్ల జరిమానాను ఎస్ఈసీకి మూంగ్ సంస్థ చెల్లించి రాజీ కుదుర్చుకుంది.

వందల కోట్ల జరిమానాలు

2019లో భారతీయ రైల్వే సహా పలు ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు 50 కోట్ల మేరకు లంచాలు ఇచ్చిందనే ఆరోపణ కేసులో ఒరాకిల్ సంస్థ రూ.195 కోట్ల జరిమానాను చెల్లించింది. 2009 నుంచి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) అధికారులతో పాటు ఇండోనేషియా, వియత్నాం అధికారులకు రూ.539 కోట్ల లంచం ఇచ్చిందనే ఆరోపణల కేసులో అల్బేమర్లే కార్పొరేషన్ రూ.1,680 కోట్ల జరిమానాను చెల్లించింది.

జార్జియాలో 11 మంది భారతీయులు మృతి

టిబ్లిసి: జార్జియాలోని ఓ ఇండియన్ రెస్టారెంట్‌లో దారుణం జరిగింది. అందులో పనిచేస్తున్న 11 మంది భారతీయులు మృత్యువాత పడ్డారని ఆ దేశంలోని భారతీయ దౌత్య కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. గుడౌరీలోని పర్వత రిసార్ట్‌కు చెందిన బెడ్‌రూమ్స్‌లో వాళ్లంతా విగతజీవులుగా పడివున్నారని భారతీయ మిషన్ వెల్లడించింది. మృతుల వివరాలు ఇంకా గుర్తించాల్సి ఉందని పేర్కొన్నది. గత శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగినట్టు జార్జియా పోలీసుల ప్రాథమిక విచారణ పేర్కొన్నది. పోలీసులు కేసు నమోదుచేశారు. వారి మరణాలకు గల కారణాల్ని కనుగొనేందుకు ఫోరెన్సిక్ మెడికల్ ఎగ్జామినేషన్ దర్యాప్తు మొదలైంది. విషపూరిత వాయువు కార్బన్ మోనాక్సైడ్ పీల్చటం వల్లే వాళ్లంతా మృత్యువాత పడ్డారని స్థానిక మీడియా పేర్కొంది.

'భూకంప' బాంబు!

- సిరియాపై ఇజ్రాయెల్ భీకర దాడి
- టార్టస్‌లో భూ ప్రకంపనలు
- రిక్టర్ స్కేలుపై 3.0గా తీవ్రత

టార్టస్‌లో సంభవించిన శక్తివంతమైన పేలుడుకు ఎగసిన అగ్ని జ్వాలలు

టెల్ అవీవ్: సిరియాపై ఇజ్రాయెల్ భీకర దాడితో విరుచుకుపడింది. తీరప్రాంత నగరమైన టార్టస్‌పై ఈ దాడి జరిగిందని, ఈ సందర్భంగా భారీ పేలుళ్లతో ఆ ప్రాంతం కంపించిపోయిందని యుద్ధాలను పర్యవేక్షించే ఓ గ్రూపు వెల్లడించింది. ఆ ప్రకంపనల తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.0గా నమోదైందని, ఈ ప్రకంపనలను దాదాపు 820 కి.మీ. దూరంలో ఉన్న టర్కీ పశ్చిమ ప్రాంత నగరం ఇస్నిక్‌లోని భూకంప సెన్సర్లు సైతం గుర్తించాయని తెలిపింది. టార్టస్‌లోని గగనతల రక్షణ యూనిట్లు, ఉపరితలం నుంచి ఉపరితలంలోని లక్ష్యాలపై ప్రయోగించే క్షిపణుల డిపోలు సహా పలు సైనిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఈ దాడులు జరిపాయని, 2012 తర్వాత సిరియా తీరప్రాంతంపై ఇజ్రాయెల్ జరిపిన అత్యంత భీకర దాడి ఇదేనని ఆ గ్రూపు పేర్కొన్నది.

ఇజ్రాయెల్ దాడుల్లో 75 మంది దుర్మరణం

గాజా స్ట్రిప్‌లో హమాస్-ఇజ్రాయెల్ మధ్య 14 నెలలుగా జరుగుతున్న యుద్ధంలో మృతుల సంఖ్య 45 వేలకు చేరుకుంది. తాజాగా ఆది, సోమవారాల్లో ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 75 మంది మృతి చెందారని గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. వీరిలో మహిళలు, పిల్లల సంఖ్య సగానికి కన్నా ఎక్కువగా ఉందని తెలిపింది.

రష్యాకు 2100 కోట్లు తరలించిన అసద్

అంతర్యుద్ధం సమయంలో గత సిరియా పాలకులు వేల కోట్ల ధనాన్ని రష్యాకు తరలించుకుపోయారు. 2018 మార్చి నుంచి 2019 సెప్టెంబర్ మధ్య కాలంలో అప్పటి సిరియా అధ్యక్షుడు బషర్ అసద్ దాదాపు రూ. 2,100 కోట్ల ధనాన్ని(250 మిలియన్ డాలర్లు) మాస్కోకు బదిలీ చేసినట్లు తెలుస్తున్నది. రెండు టన్నుల బరువున్న 100 డాలర్లు, 500 డాలర్ల నోట్ల కట్టలు సిరియా సెంట్రల్ బ్యాంకు నుంచి మాస్కోలోని విన్కోవో ఎయిర్‌పోర్టు తరలిపోగా రష్యన్ బ్యాంకులలో వాటిని డిపాజిట్ చేసినట్లు తాజాగా వార్తలు వెలువడ్డాయి. పశ్చిమ దేశాల నుంచి ఆంక్షలు ఉన్న నేపథ్యంలో సిరియా ఈ ధనాన్ని రష్యాలో భద్రపరిచినట్లు తెలుస్తున్నది. విదేశీ కరెన్సీ కొరతను ఎదుర్కొంటున్న సిరియాకు రష్యా ఆర్థిక జీవనాడిగా మారింది. సిరియాలో అంతర్యుద్ధం కొనసాగడం, పశ్చిమ దేశాల ఆంక్షల కారణంగా సిరియా ఆర్థికంగా చితికిపోయిన పరిస్థితులలో ఈ నగదు బదిలీ జరిగినట్లు తెలుస్తోంది.

పోరాడాలనుకున్నా.. కానీ తరలించారు

డమాస్కస్ తిరుగుబాటుదారుల వశమైనప్పటికీ తాను దేశం విడిచి పారిపోవాలనుకోలేదని.. అయితే రష్యా సైన్యం తనను తరలించిందని సిరియా బహిష్కృత అధ్యక్షుడు బషర్ వెల్లడించారు. తనను తిరుగుబాటుదారులు తరిమికొట్టడంపై ఆయన మొదటిసారిగా స్పందించారు. రష్యా సహకారంతో లటాకియా తీర ప్రాంతంలోని రష్యా స్థావరం నుంచి పోరాటం కొనసాగించాలని తాను భావించానన్నారు.

భారతీయులకు రష్యా వీసా ఫ్రీ ఎంట్రీ

2025 నుంచి అమల్లోకి

మాస్కో, డిసెంబర్ 16: తమ దేశంలో పర్యటించాలనుకునే భారతీయులకు రష్యా గుడ్‌న్యూస్ చెప్పింది. 2025 నుంచి భారతీయులకు 'వీసా-ఫ్రీ-ఎంట్రీ'కి అవకాశం కల్పిస్తున్నట్టు ఆ దేశం అధికారికంగా ప్రకటించింది. వీసా రహిత ప్రవేశం.. దేశాల జాబితాలో భారత్ సహా మరో 62 దేశాలను చేర్చినట్టు రష్యా సోమవారం ఒక ప్రకటన జారీచేసింది. కేవలం పాస్‌పోర్ట్, ఇతర గుర్తింపు పత్రాలతో రష్యాకు చేరుకున్నవాళ్లకు, అక్కడి ఎయిర్‌పోర్ట్‌లో 'వీసా-ఫ్రీ-ఎంట్రీ'కి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అటవీమార్గంలో వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక దర్శనం

శబరిమల: శబరిమల అయ్యప్ప దేవాలయానికి చేరుకోవడానికి పుల్లుమేడు, ఎరుమేలి అటవీ మార్గాల్లో కాలినడకన ప్రయాణించే భక్తులకు త్వరిత దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు 'ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డ్' సోమవారం ప్రకటించింది. అటవీ దారుల్లో ప్రయాణించిన భక్తులకు 'ప్రత్యేక దర్శనం' సౌకర్యం కల్పించబోతున్నట్టు బోర్డ్ అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ మీడియాకు తెలిపారు.

హర్యానాలో రైతుల ట్రాక్టర్ మార్చ్

రేపు రైల్ రోకోలో పాల్గొనాలని పంజాబ్ గ్రామాలకు విజ్ఞప్తి

అంబాలా, డిసెంబర్ 16: హర్యానా సరిహద్దుల్లో అందోళన చేస్తున్న రైతులు సోమవారం అంబాలా జిల్లాలో ట్రాక్టర్ మార్చ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో హర్యానా ప్రభుత్వం జిల్లాలోని 12 గ్రామాల పరిధిలో మొబైల్ ఇంటర్నెట్ సేవలు, పెద్ద సంఖ్యలో ఎస్ఎంఎస్‌లు పంపడాన్ని నిలిపేసింది. మరోవైపు తమ ప్రణాళిక ప్రకారం మంగళవారం పంజాబ్ వ్యాప్తంగా రైల్ రోకో నిర్వహించనున్నట్టు రైతు నేత సర్వన్ సింగ్ పంధేర్ తెలిపారు. 'రాష్ట్రంలోని 13 వేల గ్రామాల ప్రజలందరూ తమ నివాసాలకు సమీపంలోని రైల్వే క్రాసింగ్‌లు, రైల్వే స్టేషన్ల వద్ద మధ్యాహ్నం 12-3 గంటల సమయంలో రైల్ రోకో నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని ఆయన అన్నారు. విపక్షాలు ముఖ్యంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆయన పార్టీ తరపున రైతులకు ఎలాంటి హామీలు ఇవ్వలేదని పంధేర్ ఆరోపించారు.

ఆరోగ్యం విషమం.. ఆత్మార్పణకైనా సిద్ధం: ధల్లేవాల్

రైతుల సమస్యలను కేంద్రం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 21 రోజులుగా ఖనౌరీ సరిహద్దులో నిరాహార దీక్ష చేస్తున్న పంజాబ్ రైతు నేత జగ్జీత్ సింగ్ ధల్లేవాల్(70) ఆరోగ్యం బాగా క్షీణించిందని వైద్యులు తెలిపారు. ఆయనను వెంటనే దవాఖానలో చేర్పించాలని సూచించారు. అయితే ధల్లేవాల్ మాత్రం చికిత్సకు నిరాకరించారు. రైతుల డిమాండ్ల సాధన కోసం, వారి ఆత్మహత్యల నివారణ కోసం ఆత్మార్పణకైనా సిద్ధమని ప్రకటించారు. ధల్లేవాల్ సొంతంగా నిలబడలేకపోతున్నారని.. ఆయనకు గుండెపోటు వచ్చే అవకాశం ఉందని, క్రియాటినైన్ స్థాయిలు పెరిగాయని వైద్యుల బృందం పేర్కొంది.

లా ప్రాక్టీస్ చేస్తూనే జర్నలిస్టుగా పనిచేయరాదు

న్యూఢిల్లీ : ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులు పార్ట్ టైమ్‌గా కాని, ఫుల్‌టైంగా కాని ఏకకాలంలో జర్నలిస్టులుగా పనిచేయరాదని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) సోమవారం సుప్రీంకోర్టుకు తెలియచేసింది. బీసీఐ నిబంధనల్లోని 49వ నిబంధనను బీసీఐ ఉటంకించగా జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. మొహమ్మద్ కమ్రాన్ అనే న్యాయవాది వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ అంశం తెరపైకి వచ్చింది. కమ్రాన్ న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తూనే ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేస్తున్న విషయం కోర్టు దృష్టికి వచ్చింది. జర్నలిజాన్ని పూర్తిగా వదిలిపెట్టానని, న్యాయవాదిగానే కొనసాగుతున్నానని కమ్రాన్ అఫిడవిట్ దాఖలు చేశారు.

ఆడబిడ్డలకు దేశంలో రక్షణ లేదు

నిర్భయ తల్లి ఆవేదన

న్యూఢిల్లీ, డిసెంబర్ 16: దేశాన్ని కుదిపేసిన భయంకరమైన నిర్భయ సామూహిక హత్యాచార ఘటన జరిగి 12 ఏండ్లు దాటుతున్నా, దేశంలో ఇప్పటికి పరిస్థితులు మారలేదని, ఈ దేశంలో ఆడబిడ్డలకు రక్షణ లేదని నిర్భయ తల్లి ఆశా దేవి ఆందోళన వ్యక్తం చేశారు. 16 డిసెంబర్ 2012న చోటుచేసుకున్న ఈ ఘటన దేశ ప్రజల్ని కలిచివేసింది. సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో నిర్భయ తల్లి ఆశాదేవి ప్రసంగించారు. నిర్భయకు ముందునాటి పరిస్థితులే ఇప్పుడూ కొనసాగుతున్నాయని, కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ హత్యాచార ఘటనే ఇందుకు ఉదాహరణగా ఆమె పేర్కొన్నారు. ఈ కేసులో వాస్తవం ఏమిటన్నదీ ఇప్పటికీ బయటకు రాలేదని అన్నారు. 'నా కూతురు ఇప్పుడు లేదు. కానీ ఆమె చెప్పిన మాటలు నాకు ఇంకా గుర్తు ఉన్నాయి. మళ్లీ ఇలాంటి ఘటన జరగకుండా దోషులకు శిక్ష పడాలని నా కూతురు కోరుకుంది. అయితే నిర్భయ ఘటన జరిగి 12 ఏండ్లు అవుతున్నా.. ఈ దేశపు ఆడబిడ్డలకు రక్షణ లేదు' అని అన్నారు.

ట్రూడోకు షాక్.. ఉప ప్రధాని రాజీనామా

అట్టావా: కెనడాలో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకున్నది. ఉప ప్రధాని, ఆర్థిక మంత్రి క్రిస్టియా ఫ్రీల్యాండ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆమె నిర్వహిస్తున్న ఆర్థిక శాఖను మారుస్తున్నట్టు ట్రూడో చెప్పిన క్రమంలో.. తన పదవికి రాజీనామా చేయడమే ఉత్తమమని నిర్ణయించుకున్నట్టు ఆమె పేర్కొన్నారు. క్యాబినెట్‌లో అత్యంత శక్తిమంతమైన మహిళగా ఆమె గుర్తింపు ఉన్నది. విధాన నిర్ణయాలకు సంబంధించి ట్రూడోకు, ఆమెకు భేదాభిప్రాయాలు తలెత్తినట్టు స్థానిక మీడియా పేర్కొన్నది. దేశ ఆర్థిక సవాళ్లకు సంబంధించిన విషయాలను పార్లమెంట్‌కు వివరించాల్సిన కొద్ది గంటల ముందే ఆమె తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం.

యాచకులకు డబ్బులిస్తే జైలుకే

- ఇండోర్‌లో కొత్త చట్టం
- నిషేధం ఇప్పటికే అమలు
- పైలట్ ప్రాజెక్టుగా కేంద్ర పథకం

ఇండోర్, డిసెంబర్ 16: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరాన్ని యాచకులు లేని నగరంగా మార్చాలని సంకల్పించిన జిల్లా యంత్రాంగం ఈ దిశలో మరో అడుగు ముందుకేసింది. ఇప్పటికే ఇక్కడ భిక్షాటనపై నిషేధం ఉండగా, తాజాగా యాచకులకు డబ్బులు ఇచ్చేవారిపైనా కఠినంగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించారు. అలాంటి వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. కొత్త ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి ఈ కొత్త చట్టం అమలులోకి రానున్నట్టు జిల్లా కలెక్టర్ ఆశిష్ సింగ్ తెలిపారు. పుణ్యం కోసం దానం చేసి కష్టాలు పాలు కావద్దని కలెక్టర్ ప్రజలను హెచ్చరించారు. అయితే కలెక్టర్ తీసుకున్న సాహసోపేత మైన నిర్ణయంపై విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. పేదవాడికి కప్పు చాయ్ కొని వ్వడం కూడా నేరమేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా 10 నగరాలను యాచకులు లేని నగరాలుగా మార్చాలన్నది కేంద్ర ప్రభుత్వ సంకల్పం. ప్రయోగాత్మకంగా ఈ పథకాన్ని ఇండోర్‌లో అమలు చేయాలని నిర్ణయించారు.

సంతానం కోసం కోడిపిల్లను మింగి..

- ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి
- సజీవంగా ఉన్న కోడిపిల్ల
- బయటకు తీసిన వైద్యులు



రాయ్‌పూర్: సంతానం క